

క్రీడా అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : క్రీడా అకాడమీలో ప్రవేశాలకు ఈ నెల 15, 16 తేదీల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వి.సీతారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గచ్చిబౌలి అకాడమీలో హాకీ, అథ్లెటిక్స్, ఎల్‌బీ స్టేడియం అకాడమీలో హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ క్రీడల్లో బాలురు, బాలికలకు ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అర్హత, ఆసక్తి కలిగిన క్రీడాకారులు వారి విద్యార్హత, వయస్సు ఆధార్ కార్డు, క్రీడా ధ్రువీకరణ, 10 ఫొటోలతో ఎంపికలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

తెగని పంచాయితీ


చారకొండ మండలం జూపల్లిలో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న సర్వేయర్

అధికారులకు తలనొప్పిగా మారిన భూ భారతి ఫిర్యాదుల పరిష్కారం

- ఆగస్టు 15 వరకు గడువు విధింపు, పైలట్ మండలంలోనూ అంతంతే..
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భూ భారతి సదస్సుల్లో 45,269 దరఖాస్తులు రాక
- నోటీసులు జారీ చేశాక క్షేత్రస్థాయి సర్వేకు వెళుతున్న రెవెన్యూ అధికారులు
- ఈ దరఖాస్తులు పరిష్కారమైన తర్వాతనే భూ భారతి పోర్టల్ అమల్లోకి..

భూ సమస్య అంటేనే తెగని పంచాయితీ.. ఈ సమస్య ఎదురైన రైతులు రెవెన్యూ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ సంవత్సరాల తరబడి తిరిగినా పరిష్కారం లభిస్తుందనే గ్యారెంటీ లేదు. ఈ పరిస్థితుల్లో గత ప్రభుత్వ హయాంలో తెచ్చిన ధరణి పోర్టల్ భూ సమస్యలను మరింత జటిలం చేసింది. పైగా ఫిర్యాదులను పరిష్కరించుకునే సరైన మార్గంలేక రైతులు అవస్థలు పడ్డారు. దానికి విరుగుడుగా కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి పోర్టల్‌ను తీసుకువచ్చే ముందు పైలట్ ప్రాజెక్టుగా కొన్ని మండలాల్లో పాత సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేసింది. దీనికితోడు రెవెన్యూ సదస్సులు నిర్వహించి పరిష్కారానికి గడువు విధించింది. కానీ పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో భూసమస్యలు పరిష్కారమై భూ భారతి పూర్తి స్థాయిలో అమలయ్యేనా అనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది.

మహబూబ్‌నగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం గత బీఆర్ఎస్ హయాంలో తెచ్చిన ధరణి పోర్టల్‌ను రద్దు చేసి దాని స్థానంలో భూభారతి పోర్టల్ ప్రవేశపెట్టాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అసెంబ్లీలో చట్టం చేసి ఆమోదించారు కూడా. ఇప్పటికే ధరణి పోర్టల్ పేరు భూభారతిగా చూపుతున్నప్పటికీ పేరు మాత్రమే మార్చారు. ఇంకా కొత్తచట్టం ప్రకారం కొత్త పోర్టల్ రూపురేఖలు మారలేదు. అంతకుముందే ఆయా గ్రామాల్లో ఉండే భూ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం భావించింది. మొదట రాష్ట్రంలో కొన్ని మండలాలను పైలట్‌గా తీసుకొని భూ భారతి రెవెన్యూ సదస్సులను ప్రారంభించగా వాటిని పరిష్కరించి జూన్ 2న పూర్తిస్థాయిలో పోర్టల్‌ను అందుబాటులోకి తేవాలనుకున్నారు. కానీ క్షేత్రస్థాయిలో సమస్యలు తీవ్రంగా ఉండటం పోర్టల్ వచ్చిన తర్వాత వాటి పరిష్కారం ఇబ్బందిగా మారే పరిస్థితి ఉండటంతో అన్ని మండలాల్లోని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. గత నెలలో ఈ సదస్సుల నిర్వహణ కూడా పూర్తయ్యింది. అందులో భాగంగా వచ్చిన దరఖాస్తులను ఆగస్టు 15లోపు పరిష్కరించాలని గడువు విధించారు. ఇందుకు ఇంకా నెలరోజులు మాత్రమే సమయం ఉంది. ఇప్పటివరకు ముందుగా నిర్వహించిన పైలట్ మండలం నారాయణపేట జిల్లా మద్దూరులోనే 45 శాతం దరఖాస్తులను పరిశీలించారు. మిగతా జిల్లాల్లోని మండలాల్లో ఇప్పటివరకు ఇంకా నోటీసుల ప్రక్రియ కూడా పూర్తి కాలేదు. కొన్నిచోట్ల క్షేత్ర స్థాయి పరిశీలనలు జరుగుతుండగా మరికొన్ని చోట్ల దరఖాస్తులతో అధికారులు కుస్తీ పడుతున్నారు. గడువు విధించిన ఆగస్టు 15లోగా పరిష్కారం పూర్తికాకపోతే భూభారతి పోర్టల్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడం మరింత ఆలస్యం కానుంది.

45,269 దరఖాస్తులు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఐదు జిల్లాల పరిధిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భాగంగా 45,269 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో

(మిగతా 7లో..)

జిల్లాల వారీగా భూ భారతి కింద వచ్చిన దరఖాస్తుల వివరాలు

ఫిర్యాదు విభాగం	మహబూబ్ నగర్	వనపర్తి	గద్వాల	నాగర్‌కర్నూల్	నారాయణ పేట	మొత్తం
మిస్సింగ్ సర్వే నెంబర్లు	3308	1208	862	4366	1284	11028
పెండింగ్ మ్యుటేషన్	324	419	290	709	191	1933
డీఎస్ పెండింగ్	461	384	576	855	324	2600
విస్తీర్ణం సమస్య	846	316	366	1104	776	3408
భూమి స్వభావం సరిచూడటం	377	292	82	505	174	1430
పట్టాదారు పేర్లు సరి చూడటం	362	845	250	489	335	2281
నిషేధిత జాబితా నుంచి తొలగింపు	277	120	115	259	97	868
నిషేధిత జాబితాలో చేర్పు	10	5	1	35	19	70
అసైన్డ్ భూముల సమస్యలు	537	1362	427	1671	58	4055
ఓఆర్‌సీ లేనివి	490	110	187	186	22	995
38ఈ సర్టిఫికెట్ లేనివి	41	9	6	5	4	65
సక్సేషన్	1439	803	591	1524	254	4611
భూసేకరణ	62	60	65	173	1	361
ఇతరాలు	2375	2142	1767	4474	513	11271
మొత్తం	10909	8075	5585	16648	4052	45269

తేజేశ్వర్ హత్య కేసులో

కీలక పరిణామం

- పోలీసు కస్టడీకి నలుగురు నిందితులు
- మిగిలిన వారికి రిమాండ్ పొడిగింపు
- మరింత లోతుగా విచారణకు చర్యలు
- జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు


తేజేశ్వర్ (ఫైల్)

గద్వాల క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకున్నది. ఈ కేసులో నలుగురు నిందితులను బుధవారం అర్ధరాత్రి పోలీసులు కస్టడీలోకి తీసుకున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. వారిని నాలుగు రోజుల పాటు విచారించేందుకు అనుమతి తీసుకున్నట్లు చెప్పారు. తేజేశ్వర్ హత్య కేసులో పూర్తి స్థాయి వివరాలు రాబట్టేందుకు మరింత లోతుగా దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

గత నెల 17న సంఘటన

గద్వాల జిల్లా కేంద్రంలోని కిష్టారెడ్డి బంగ్లా ప్రాంతానికి చెందిన సర్వేయర్ తేజేశ్వర్ గత నెల 17న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అతడి అన్న తేజవర్ధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ప్రధాన నిందితుడు తిరుమల్‌రావుతో పాటు మరో 7 గురిని అరెస్ట్ చేసి గత నెల 26వ తేదీన రిమాండ్‌కు తరలించారు. అయితే ఈ కేసులో పోలీసులకు పలు అనుమానాలు ఉన్నట్లు తెలుస్తోంది. నిందితులు సర్వేయర్ తేజేశ్వర్‌ను ఎలా పరిచయం చేసుకున్నారు? ఎలా నమ్మించారు? అతడిని వారి వాహనంలోకి ఎలా ఎక్కించుకున్నారు? డబ్బులు ఏమైనా ఇస్తామని ఆశ చూపించారా? లేకపోతే వారు చెప్పిన మాటలను అతడు ఎలా నమ్మి వారి వెంట వెళ్లారు? తదితర సందేహాలకు సమాధానం లభించాల్సి ఉంది. అలాగే తేజేశ్వర్‌ను మొదట ఎక్కడికి తీసుకెళ్లారు? ఎక్కడెక్కడ తిప్పారు? బయటపడ్డ నిందితులతో పాటు ఇంకా ఎవరైనా ఉన్నారా అనే విషయాలపై లోతుగా విచారించేందుకు పోలీసులు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. అంతేగాకుండా తిరుమల్‌రావు ఐశ్వర్యను తీసుకెళ్లింటే సరిపోయేది కదా? తేజేశ్వర్‌ను ఎందుకు హత్య చేయించాల్సి వచ్చింది? ఇలా హత్య వెనుక ఉన్న వాస్తవాలను పూర్తి స్థాయిలో వెల్లడి కావలసి ఉన్నది. అందుకోసం కేసులో ప్రధాన సూత్రదారులుగా ఉన్న ఏ1 తిరుమల్‌రావు, ఏ3. కుమ్మరి నగేశ్, ఏ4 చాకలి పరశురామ్, ఏ5 చాకలిరాజులను కస్టడీలోకి తీసుకున్నారు. మిగిలిన నిందితులు ఐశ్వర్య, మోహన్, తిరుపతయ్య, సుజాతలను గురువారం కోర్టులో హాజరు పరిచారు. వారికి మరో 14 రోజులు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు.


నిందితులను వాహనంలో మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలిస్తున్న పోలీసులు


గ్రామస్థులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

పథకాల అమలుపై కేంద్ర బృందం సంతృప్తి

- గుర్రంగడ్డ గ్రామంలో పర్యటన
- అభివృద్ధి పనుల పరిశీలన
- మహిళా సంఘాల సభ్యులతో సమావేశం

గద్వాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై కేంద్ర పర్యవేక్షణ బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని గుర్రంగడ్డ గ్రామంలో గురువారం బృందం సభ్యులు బాలమురళి, రాధికలు పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ పరంగా అందుతున్న ఆర్థిక తోడ్పాటుపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని ప్రతీ ఇంటిని పరిశీలించారు. కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు వారితో మాట్లాడుతూ గుర్రంగడ్డ రోడ్డు బ్రిడ్జి నిర్మాణం త్వరతగతిన పూర్తి చేయాలని కోరారు. ఆ పనులు కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉండవని, రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి చేస్తుందని సభ్యులు వారికి తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. వారి వెంట అదనపు కలెక్టర్ నర్సింగరావు, గద్వాల ఎంపీడీవో చంద్రకళ, ఏపీవో విజయలలిత, పంచాయతీ కార్యదర్శి పాండు తదితరులు ఉన్నారు.

'ఫార్మర్ రిజిస్ట్రీ'పై అనాసక్తి

- వనపర్తి జిల్లాలో 1,94,660 మంది రైతులు
- వివరాలు నమోదు చేసుకున్నది 56,411 మంది
- అవగాహన కల్పించని వ్యవసాయశాఖ అధికారులు
- పొలం పనుల్లో నిమగ్నమైన వ్యవసాయదారులు


నందిమల్లలో రైతుల వివరాలను నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషించే 'ఫార్మర్ రిజిస్ట్రీ'పై వనపర్తి జిల్లా రైతులు ఆసక్తి చూపడం లేదు. వివరాలు నమోదు చేయించుకున్న రైతులకు ప్రభుత్వం 11 అంకెల విశిష్ట సంఖ్యను కేటాయించి, గుర్తింపు కార్డు ఇస్తుంది. పట్టాదారు పాస్‌బుక్ ఉన్న వారందరూ వివరాలను నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. దీంతో వారు వివరాల నమోదుకు ముందుకు రావడం లేదు. దీనికి తోడు కార్డు ప్రాధాన్యంపై అవగాహన లేక కొందరు రైతులు పట్టించుకోవడం లేదు. మే 5వ తేదీన ఈ ప్రక్రియ ప్రారంభం కాగా, వనపర్తి జిల్లాలో ఇప్పటి వరకు 30 శాతం మంది రైతులు మాత్రమే వివరాలను నమోదు చేయించుకున్నారు.

- వనపర్తి (ఆంధ్రజ్యోతి)

తమిళనాడులో

వివాహిత ఆత్మహత్య


పల్లవి (ఫైల్)

- మృతదేహాన్ని గ్రామానికి తరలించిన భర్త
- అతడి కుటుంబ సభ్యులపై మృతురాలి బంధువుల దాడి
- అమరచింత మండలంలోని నాగల్‌కడుమూర్‌లో ఉద్రిక్తత

6

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బస్సు

- భార్యాభర్తలు, కుమార్తెకు గాయాలు
- గోపాల్‌పేట మండల కేంద్రంలో ఘటన

7

రిటైర్డ్ వాచర్ మృతదేహం లభ్యం

- జూన్ 26న నల్లమల అడవికి వెళ్లి అదృశ్యం

6

విద్యుదాఘాతంతో రైతు మృతి

- ఖిల్లాఘణపురం మండలంలో ఘటన

7

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

- డీఆర్‌డీవో పీడీ ఉమాదేవి
- ఆత్మకూరులో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

7

విద్య, వైద్యం, సంక్షేమానికి పెద్దపీట

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి
- నేడు వైద్య కళాశాల నూతన భవన ప్రారంభోత్సవం
- 550 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన
- హాజరుకానున్న ముగ్గురు మంత్రులు

నాగర్‌కర్నూల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో విద్య, వైద్యం, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నదని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. మెడికల్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య కళాశాల నూతన భవనాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే రూ. 235 కోట్ల వ్యయంతో 550 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు దామోదర రాజనరసింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావులు హాజరు కానున్నారని తెలిపారు. తూడుకుర్తిలో రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేస్తారన్నారు. రూ. 9 కోట్ల వ్యయంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. జిల్లా ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రస్తుతం కొనసాగుతున్న ఆసుపత్రిని మాతా, శిశు సంక్షేమ కేంద్రంగా మారుస్తామని తెలిపారు. వార్డుల వారీగా 8 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఇందుకు అవసరమైన వనరులను సమకూర్చాలని మునిసిపల్ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, మార్కెట్ చైర్మన్ రమణారావు, నాయకులు సునేంద్ర, జక్కా రాజు, నిజాం, ఖాదర్, నరేందర్, తెలకపల్లి పర్వతాలు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

» డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్

నర్వ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలో ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. ఏవైనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే వైద్య శిబిరానికి తీసుకొచ్చి అప్పటికప్పుడు పరీక్షలు చేయాలన్నారు. 161 మందికి పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. డాక్టర్ సత్యప్రకాష్‌రెడ్డి, వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా ఎన్సీడీ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, సీహెచ్‌వో రాము నాయక్, శ్రీధర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల సర్వే

బాలానగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో భూ కబ్జాలపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు గురువారం సర్వే నిర్వహించారు. బాలానగర్ మండల కేంద్రానికి చెందిన గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కొందరు గ్రామ పెద్దలు ఇటీవల ప్రజావాణి కార్యక్రమంలో చిన్న చెరువు కట్ట బఫర్ జోన్ కబ్జాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ శాఖ అధికారులు రెవెన్యూ శాఖ అధికారులు కలిసికట్టుగా సర్వే నిర్వహించారు. బఫర్ జోన్ చిన్న చెరువు కట్ట కింద నక్షా బాట, మండల కేంద్రంలో స్థానిక రిపోర్టర్లకు కేటాయించిన ఇళ్ల స్థలాలకు సంబంధించిన భూమి రైల్వే స్టేషన్ పాత బీటీ రోడ్డు కబ్జాల గురించి, వేంకటేశ్వరస్వామి గుట్ట పక్కన ప్రభుత్వ భూమి ఆక్రమణకు సంబంధించిన వాటిపై సర్వే నిర్వహించారు.

ఈనెల 17 నుంచి

మాసుంబాబా 40వ ఉర్సు



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న దర్గా నిర్వాహకులు

పెంట్లవెల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జటప్రోలు గ్రామంలో ఈనెల 17, 18వ తేదీలలో మాసుంబాబా 40వ ఉర్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉర్సు వాల్ పోస్టర్లను మాసం బాబా దర్గా నిర్వాహకులు విడుదల చేశారు. దర్గా నిర్వాహకులు సయ్యద్ ఒలియోద్దీన్ షా ఖాద్రి మాట్లాడుతూ ఈ నెల 17న గంధోత్సవం, 18న శుక్రవారం దీపోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ గంధోత్సవానికి ఉమ్మడి జిల్లా నలుమూలలతో పాటు రాయలసీమ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారని అన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు సయ్యద్ నసీరుద్దీన్ షా ఖాద్రి మోహిముద్దీన్ షాఖాద్రి పాల్గొన్నారు.

పిల్లలతో పని చేయించడం నేరం

ఊట్కూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం బాల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రొటెక్షన్ ఆఫీసర్ తిరుపతయ్య మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లను పనిలో పెట్టుకోవడం నేరమని తెలిపారు. సమాజంలో ఇప్పటికీ పిల్లల చేత వెట్టిచాకిరి చేయిస్తున్నారని తెలిపారు. పిల్లలు ఆడుతూపాడుతూ చదువుకునే వయస్సులో పని భారం మోపకూడదని తెలిపారు. ప్రభుత్వం ఉచిత విద్యను అందిస్తుందని తెలిపారు. ఆర్థిక స్థోమత లేని వారు గురుకులాల్లో, వసతి గృహాల్లో ఉచితంగా చదివించవచ్చని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సహాయం కావాలన్నా1098 చైల్డ్‌హెల్ప్ లైన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఎంఈవో మాధవి, సామాజిక కార్యకర్త సంతోష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

మక్తల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు ఉంటాయని జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ మొహ్మద్ ఖదీర్, తహసీల్దార్ సతీష్‌కుమార్ తెలిపారు. గురువారం మక్తల్ మండలంలోని కాచ్‌వార్ సమీపంలో తిమ్మారెడ్డి పొలంలో 4.5ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆయిల్‌పామ్ సాగు చేయడంతో అధిక లాభాలు ఉంటాయన్నారు. ఎకరాకు రూ.4వేలు మొక్కల పెంపకానికి, సబ్సిడీపై డ్రిప్ అందిస్తామన్నారు. జిల్లాలో 150ఎకరాల లక్ష్యంతో మొక్కలు నాటిస్తామన్నారు. ఆసక్తిగల రైతులు హార్టికల్చర్ అధికారులను సంప్రదించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో తిమ్మారెడ్డి, సూర్య, అంజనేయులు, వెంకటేష్, రాములు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో

4.1కిలోల ఆడ శిశువు జననం



4.1కిలోల బరువుతో జన్మించిన ఆడ శిశువుతో వైద్యులు

కందనూలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో గురువారం జిల్లాకు చెందిన మౌనికకు పురిటి నొప్పులు రావడంతో ఆసుపత్రికి వచ్చారు. ఆమెకు స్త్రీ వైద్య నిపుణులు, సంబంధిత నర్సింగ్ సిబ్బంది చికిత్స అందించగా రెండవ ప్రసవంలో 4.1కిలోల బరువు గల ఆడ శిశువు జన్మించింది. ప్రసవానంతరం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. సాధారణ ప్రసవంలో అధిక బరువు గల శిశువు జన్మించడంతో గైనకాలజీ వైద్యులను సిబ్బందిని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.ఉషారాణి అభినందించారు. అనంతరం శిశువును తల్లికి అప్పగించారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ప్రతీ రోజు 10 నుంచి 15 ప్రసవాలు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవిశంకర్‌నాయక్, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ కవిత, డాక్టర్ శిరీష, డాక్టర్ నిఖిత, డాక్టర్ దివ్య, డాక్టర్ ప్రవళిక, నర్సింగ్ సిబ్బంది రేవతి, ప్రసన్న, సువేద, రేణుక, రాధ, సుప్రియ, శ్రావణి, అనసూయ, సంగీత, ఉమా తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

తాడూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి ప్రధాన రహదారిపై గురువారం వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. భూత్పూర్ మండలం మొల్గర గ్రామానికి చెం దిన వెంకటేశ్ అనే వ్యక్తి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడని ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. అతన్ని నాగర్‌కర్నూల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా న్యా యాధికారి శృతి దూత ఒక రోజు జైలు శిక్ష విధించారని ఎస్‌ఐ తెలిపారు. అతన్ని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

నల్లమలలో రిటైర్డ్ వాచర్ మృతదేహం లభ్యం



తోకల మల్లయ్య (ఫైల్)

మన్ననూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలోని 12 రోజుల క్రితం అదృశ్యమైన అప్పాపూర్ పెంటకు చెందిన రిటైర్డ్ ప్రొటెక్షన్ వాచర్ తోకల మల్లయ్య మృతదేహం గురువారం లభించింది. అప్పాపూర్ పెంటకు చెందిన తోకల మల్లయ్య తన పెంపుడు కుక్కతో కలిసి జూన్ 26న సమీప అడవిలోకి వెళ్లి తప్పిపోయాడు. కుటుంబ సభ్యుడు 12 రోజులుగా అడవిలో గాలిస్తున్న క్రమంలో అప్పాపూర్ పెంటకు 3 కిలో మీటర్ల దూరంలోని ఓ చెట్టు కింద గురువారం మల్లయ్య మృతదేహం లభించినట్లు బాధిత బంధువులు తెలిపారు. లింగాల రాణాలో ఇదివరకే కేసు నమోదవ్వగా, పోలీసులు శవపంచనామా చేసి తోకల మల్లయ్య మృతికి కారణాలను అన్వేశించే అవకాశం ఉంది.

'ఫార్మర్ రిజిస్ట్రీ'పై అనాసక్తి

» వనపర్తి జిల్లాలో 1,94,660 మంది రైతులు » వివరాలు నమోదు చేసుకున్నది 56,411 మంది » అవగాహన కల్పించని అధికారులు



గోపాల్‌పేట మండల కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఈవో నాగరాజు

వనపర్తి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : 'ఫార్మర్ రిజిస్ట్రీ'పై వనపర్తి జిల్లా రైతులు ఆసక్తి చూపడం లేదు. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లాలో ముందుకు సాగడం లేదు. వివరాలు నమోదు చేయించుకున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం ఒక విశిష్ట సంఖ్యను కేటాయించి, గుర్తింపు కార్డు ఇవ్వనున్నది. అందుకోసం రైతులు తప్పనిసరిగా వివరాలను చేసుకోవాలని ప్రభుత్వం చెప్తోంది. ఈ విషయంపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించకపోవడంతో ప్రక్రియ ముందుకు సాగడం లేదన్న విమర్శలున్నాయి.

30 శాతం మాత్రమే పూర్తి

ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ మే 5వ తేదీ నుంచి ప్రారంభమైంది. అందుకోసం సంబంధిత రైతులు ఏఈవో, ఏవోలకు పూర్తి వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. ఆధార్ కార్డుతో పాటు దానికి అనుసంధానం చేసిన మొబైల్ ఫోన్‌ను తీసుకెళ్లాల్సి ఉంటుంది. రైతుల వివరాలను నమోదు చేసేటప్పుడు అతడి ఫోన్‌కు మూడుసార్లు ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు చేయగానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఆ తర్వాత 11 అంకెలతో కూడిన యూనిక్ ఐడీ కార్డు వస్తుంది. వనపర్తి జిల్లాలో ఇప్పటి వరకు 30 శాతం రైతులు మాత్రమే వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమై ఉన్నారు. దీంతో వారు వివరాల నమోదుపై ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ వేగం పుంజుకోవడం లేదు. ప్రస్తుతం వనపర్తి జిల్లా వ్యాప్తంగా 1,94,660 మంది పట్టాదారు పాస్‌బుక్ కలిగిన రైతులున్నారు. వారిలో ఇప్పటివరకు 56,411 మంది మాత్రమే 'ఫార్మర్ రిజిస్ట్రీ' చేయించుకున్నట్లు అధికారులు చెప్తున్నారు.

భవిష్యత్తులో చాలా కీలకం

ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ రాబోయే రోజుల్లో రైతులకు చాలా కీలకంగా మారనున్నది. ఈ 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యతోనే కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతులకు అందనున్నాయి. త్వరలో మంజూరు చేయనున్న కిసాన్ సమృద్ధి డబ్బులు కూడా ఈ గుర్తింపు కార్డు పొందిన రైతులకే వర్తింపచేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే అమలవుతున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, సాయిల్ హెల్త్ కార్డు, ఫసల్ బీమా తదితర పథకాలకు కూడా రైతులు వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు కూడా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఉండాలనే నిబంధన విధించే అవకాశం ఉంది. రైతులు నమోదు చేసుకున్న వివరాలన్నింటినీ ఆధార్ కార్డుతో అనుసంధానం చేయనున్నారు. దీంతో ఒక్క క్లిక్‌తో రైతులకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుంది. దీంతో సంక్షేమ పథకాలను వర్తింపచేయడం సులభతరం కానున్నది.

నమోదు చేసుకోవాలి



పట్టాదారు పాసు బుక్కు ఉన్న ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాం. ప్రస్తుతం వ్యవసాయ పనులతో పాటు మునిసిపాలిటీ కేంద్రాల్లో నమోదు ప్రక్రియ జరగడం లేదు కాబట్టి కొంత ఆలస్యం అవుతోంది. ఈ నెల చివరి వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

\- గోవిందు నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

తమిళనాడులో వివాహిత ఆత్మహత్య



నాగల్‌కడుమూర్ గ్రామంలో ఉన్న పోలీసుల భద్రత

» మృతదేహాన్ని గ్రామానికి తరలించిన భర్త
» భర్త బంధువులపై మృతురాలి బంధువుల దాడి
» అమరచింత మండలం, నాగల్‌కడుమూర్‌లో ఉద్రిక్తత

అమరచింత, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : 11 నెలల కుమారుడిని భర్త వద్దే వదిలి తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరు సమీపంలో ఓ వివాహిత రైలులో నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్ర మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పల్లవి అలియాస్ మాధవి (25) కి అమరచింత మండలం నాగల్‌కడుమూర్ గ్రామానికి చెందిన వెంకటన్న పెద్ద కుమారుడు కురువ శివతో వివాహమైంది. శివ కుటుంబం మొదటి నుంచి హైదరాబాద్‌లోనే ఉంటూ తరచూ గ్రామానికి వచ్చి వెళ్లేవారు. ఈ దంపతులకు 11 నెలల కుమారుడు ఉన్నాడు. ఇద్దరు దంపతులు హైదరాబాద్‌లోని పహాడీ షరీఫ్ ప్రాంతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఆదివారం ఏకాదశి రోజు గుడికి వెళ్లొద్దామని భర్త చెప్పగా తల్లిదండ్రులతో కుమారుడిని తీసుకొని వెళ్ల, గుడికి రాలేను అని భార్య చెప్పింది. గుడికి వెళ్లొచ్చేలోపే పల్లవి ఇంట్లో కనబడలేదు. దీంతో ఆ రోజంతా తన భార్య కోసం భర్త వెతుకగా లాభం లేకపోవడంతో అదే రోజు పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సోమవారం తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరు సమీపంలో రైలు పట్టాల పక్కన ఆమె మృతి చెంది ఉన్నట్లు అక్కడి రైల్వే పోలీసులు గమనించి కేసు నమోదు చేసుకున్నారు. మృతురాలి ఆధార్ కార్డు ఆధారంగా తమిళనాడు పోలీసులు గద్వాల జిల్లా కొండపల్లిలో ఉన్న మృతురాలి తండ్రికి సమాచారం ఇచ్చారు. పంచనామా అనంతరం అంబులెన్స్‌లో మృతదేహాన్ని గురువారం ఉదయం నాగల్‌కడుమూర్ గ్రామానికి తరలించారు.

ఇరు వర్గీయుల మధ్య ఘర్షణ

మృతదేహాన్ని తీసుకువచ్చేలోపే మృతురాలి బంధువులు పెద్ద సంఖ్యలో వాహనాల్లో నాగర్‌కడుమూర్ గ్రామానికి చేరుకొని మృతికి భర్తే కారణమని భర్త బంధువులపై దాడి చేశారు. దీంతో హుటాహుటిన అక్కడి వచ్చిన ఆత్మకూరు సీఐ శివకుమార్ వివిధ మండలాల ఎస్‌ఐలతో ప్రత్యేక బలగాలతో గ్రామానికి చేరుకుని అల్లరి మూకలను చెదరగొట్టారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. సాయంత్రం రెండు వర్గాల మధ్య పెద్దలు గ్రామ సమీపంలో ప్రైవేటు పంచాయతీ నిర్వహించారు. వరకట్నంగా ఇచ్చిన మొత్తం తిరిగి ఇచ్చేందుకు ఒప్పందం చేయడంతో గొడవ సద్దుమణిగింది. పోలీసుల భద్రత మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

చెరువులో పూడికతీత పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న జల్ శక్తి అభియాన్ సెంట్రల్ టీం

ఊర్కొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి : మండలంలోని ఇప్పపహాడ్ గ్రామాన్ని జల్ శక్తి అభియాన్ సెంట్రల్ టీం సందర్శించింది. ఈ సందర్భంగా 2022-23లో గ్రామ పరిధిలోని చెరువుల్లో తీసిన పూడికతీత పనులు, చేపట్టిన పని వివరాలు, వాటికి సంబంధించిన అనుమతులు, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జల్ శక్తి అభియాన్ సెంట్రల్ టీం ఏకసభ్య అధికారి పవార్, ఏపీడీ చంద్రశేఖర్, ఎంపీడీవో కృష్ణయ్య, ఏపీవో నరసింహ, ఎంపీవో లక్ష్మణ్‌నాయక్, డీఆర్డీఏ అధికారులు పవన్, శ్రీకాంత్ ఉన్నారు.

పీజీ సెంటర్‌లో పర్యావరణ పోటీలు



పర్యావరణ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొల్లాపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్‌పోలోనియస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణంపై పోటీలు నిర్వహించారు. మినిస్ట్రీ ఆఫ్ ఫారెస్టు, ఎన్విరాన్‌మెంట్, అండ్ క్లైమెట్ చేంజ్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ వారి అనుసంధానంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. పోటీ అంశాలను విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ క్లుప్తంగా వివరించారు. కళాశాలలో పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తను తొలగిస్తు వివిధ రకాలుగా ఉన్న తడి, పొడి చెత్త రీసైక్లబుల్ చెత్తను విభజించి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఇతర విభాగాల విద్యార్థులు పోటీలో పాల్గొంటూ పీజీ సెంటర్ పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సంతోష్ కుమార్, అధ్యాపక, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

వీపనగండ్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మామిడి సాగులో రైతులు ఆధునిక విధానాలు పాటించాలని కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మామిడిసాగు విధానం యజమాన్య పద్ధతులు , ఎగుమతులు చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విధానంలో వస్తున్న ఆధునిక విధానాలకు అనుగుణంగా రైతులు తమ ఆలోచన విధానాలను మార్చుకోవాలన్నారు. ఆయిల్ పామ్, కూరగాయల సాగులో ప్రభుత్వం రైతులకు సబ్సిడీ కల్పిస్తోందని, దీన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. శాస్త్రవేత్త సురేష్ మాట్లాడుతూ యజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి సాధిస్తూ.. ఆర్థికంగా ఎదగాలన్నారు. అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్షన్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ హైద రాబాద్ మేనేజర్ పెద్దస్వామి, ఉద్యాన శాఖ మండలాధికారి కృష్ణ, ఏఈవో అభిలాష్, రవికుమార్ పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

» బంగారు, వెండి ఆభరణాల అపహరణ
» నిందితుల కోసం గాలింపు

చిన్నచింతకుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్ నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని ఉంద్యాల గ్రామంలో ఒక ఇంట్లో పట్ట పగలే చోరీ జరిగింది. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి బంగారు, వెండి ఆభరణాలతో ఉడాయించారు. చిన్నచింతకుంట ఎస్‌ఐ రామ్‌లాల్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం సాయంత్రం అందాజా 4 గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన మహమ్మద్ అక్రమ్, అతని తల్లి ఫహిదా బేగంలు వారి ఇంట్లోనే ఉండి నిద్రిస్తున్న సమయంలో ఈ చోరీ జరిగింది. అదే రోజు కొద్ది సేపటికే నిద్రలేచి తన ఇంట్లో గల చిన్న బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చూడగా బీరువా తెరుచుకుని ఉంది. వెంటనే తల్లిని పిలిచి బీరువాను తెరిచావా అంటూ అడిగాడు. ఆమె కూడా తెరవలేదు అని చెప్పడంతో వారికి అనుమానం వచ్చి బీరువా తెరిచి చూడగా అందులో దాచుకున్న 3.9 తులాల బంగారు గొలుసులు, అదే విధంగా 19 తులాల వెండి కాళ్ల గొలుసులు , వీటితో పాటు నలుపు రంగు సెల్‌ఫోన్, మరికొన్ని వస్తువులు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు.

వీటి విలువ రూ.3,30,350లు ఉండవచ్చునని ఎస్‌ఐ తెలిపారు. అయితే విషయం తెలుసుకున్న క్లూస్ టీం చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. నిందితుల కోసం గాలింపు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్‌లాల్ నాయక్ తెలిపారు.

రియల్టర్‌పై హత్యాయత్నం

బాలానగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని చిన్నంగులగడ్డతండా గ్రామ పంచాయతీ కేజీబీవీ పాఠశాల గేటు వద్ద గురువారం గుర్తు తెలియని వ్యక్తులు రియల్టర్ బాలునాయక్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఎస్సై లెనిన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

రాజాపూర్ మండలం సింగమ్మగూడతండా గ్రామ పంచాయితీ పరిధిలోని కేసీఆర్‌నాయక్ తండాకు చెందిన సభావత్ బాలునాయక్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వాడు. వ్యాపారంలో భాగంగా కొందరు వ్యక్తులతో తగాదాలు ఉన్నాయి. ఈ తగాదాలలో భాగంగా సదరు వ్యక్తులు బాలునాయక్‌పై దాడి చేసి హత్యాయత్నం చేశారని ఎస్‌ఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కుసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

నవాబ్‌పేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఇంటిముందు నుంచి వెళ్తున్న ఓ మహిళను దూషించిన సంఘటనలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కారుకొండ గ్రామానికి చెందిన కావలి లాలమ్మ ఈనెల 9న ఆమె దాయాదులైన కా వలి రమేష్, కావలి నిరంజన్, కావలి వెంకటయ్య ఇంటిముందు నుం చి వెళ్తుండగా, ఎందుకు పోతున్నావంటూ ఆమెను దూషించారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె పెద్ద కుమారుడు కావలి కృష్ణయ్య సద రు వ్యక్తులను మందలించాడు. ఇంటికి వెళ్లి వారు మళ్లీ వచ్చి కర్రలతో దాడికి యత్నించగా, కృష్ణయ్య భార్య చంద్రకళ, అన్న వెంకటయ్యలు వచ్చి మందలించగా వారిపై సైతం దాడి చేశారు. అలాగే లాలమ్మ తమను తిట్టినందుకు తాము మందలించబోతె తమపై దాడి చేశారని రమేష్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రం తెలిపారు. ఇరువర్గాలపై కేసున మోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు నెమళ్ల అప్పగింత



అటవీ శాఖ అధికారులకు నెమళ్లను అప్పగిస్తున్న ఎస్‌ఐ చంద్రకాంత్

మానవపాడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమరవాయి గ్రామ శివారులోని పంటపొలాల్లో తిరుగుతున్న రెండు నెమళ్లు అనారోగ్యంతో ఉండటాన్ని గమనించిన బాటసారులు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఎస్‌ఐ చంద్రకాంత్ అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో బీట్ ఆఫీసర్లు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని నెమళ్లను తీసుకువెళ్లారు.

ఫిట్‌నెస్ లేని రెండు బస్సులు సీజ్

అయిజ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అయిజ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన రెండు బస్సులను ఆర్టీవో అధికారులు గురువారం సీజ్ చేశారు. ఫిట్‌నెస్ లేకుండా పాఠశాల విద్యార్థులను తరలిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందటంతో విచారణ చేసి బస్సులను సీజ్ చేశారు. ఏ పాఠశాల బస్సులు అయినా నిబంధనలను అతిక్రమించి రోడ్లపైకి వచ్చి పిల్లలను తరలించినట్లైతే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

» పలువురిని విచారిస్తున్న పోలీసులు

గద్వాల క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఇద్దరు కళాశాల విద్యార్థులపై దాడి చేసిన కేసులో పలువురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని కోటబురుజు సమీపంలో బుధవారం సాయంత్రం గంజిపేట కాలనీకి చెందిన రవితేజ్, చరణ్‌తేజపై ఎరుకలిరాజు, ఉదయ్, భాను, మరికొందరు దాడి చేయగా ఎరుకలి రాజు కత్తితో హత్యాయత్నం చేశాడని బాధితుల ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు గురువారం పలువురిని విచారించామని, ఇందులో ఎవరెవరు ఉన్నారనే విషయాలను పూర్తిగా తెలుసుకుంటామని, వారిపై కూడా చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

ఆర్‌ఎంపీ అదృశ్యం

పెబ్బేరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు మండలానికి చెందిన ఆర్‌ఎంపీ కనిపించడం లేదని గురువారం కుటుంబ సభ్యులు పోలీసుల కు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ గంగిరెడ్డి యుగేందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరంగాపూర్ మండలం జానంపేటకు చెందిన వీ రపాగ విజయ్ కొన్ని సంవత్సరాలుగా పెబ్బేరులో నివాసం ఉంటున్నాడు. మండలంలోని కంచి రావుపల్లిలో ఆర్‌ఎంపీగా పని చేసుకుంటూ జీవ నం కొనసాగిస్తున్నాడు. బుధవారం బీచుపల్లి ఆలయానికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన విజయ్ ఇంటికి రాకపోవడం, ఫోన్ స్విచ్‌ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొన సాగిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

మానవపాడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన యువకుడు తిరిగి రాలేదు. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మం డల పరిధిలోని జల్లాపురంలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ చంద్రకాంత్ తెలి పిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, హుసేన్ దంపతుల చిన్నకుమారుడు ప్రేమరాజు(25) గత నెల 30న ఇంటి నుంచి వెళ్లి ఇప్ప టివరకు తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లేకపోవడంతో గురువా రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.

మెకానిక్ దుకాణం యజమానిపై కేసు నమోదు

అలంపూరు చౌరస్తా, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తాలో బుధవారం ఆపరేషన్ ముస్కాన్ టీం అధికారులు మెకానిక్ దుకాణంలో ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ 15ఏళ్ల బాలుడు పనిచేస్తున్నట్లు గుర్తించారు. దీంతో యజమానిపై కేసు నమోదు చేశామని ఉండవెల్లి మండల ఎస్సై శేఖర్ తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ టీం అధికార బృందం ఎస్‌ఐ కేశవరావు, సుధారాణి, టి.రాజు, ప్రకాష్, నవీన్ కలిసి అలంపూరు చౌరస్తాలో మెకానిక్ షాప్‌ను తనిఖీ చేశారు. షేక్ అన్సార్‌బాషా అనే బాలకార్మికుడు యాసిన్ మోటార్ షాపులో పనిచేస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. బాలుడిని చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు. యాసిన్ మోటార్స్ యజమాని మహమ్మద్ షషావలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.

వ్యక్తి రిమాండ్

ఊర్కొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన రాచాలపల్లి గ్రామానికి చెందిన మాడ్గుల రమేష్‌ను కోర్టులో హాజరుపరుచగా కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపారు. మంగళవారం రాత్రి పోలీసులు విధినిర్వహణలో మండలంలోని రాచాలపల్లి గ్రామానికి చేరుకొాగ అదే గ్రామానికి చెందిన మాడ్గుల రమేష్ పోలీసులపై దుర్భాషలాడిన విషయం పాఠకులకు విధితమే. అందులో భాగంగా గురువారం కల్వకుర్తి కోర్టులో హాజరుపరుచగా న్యాయాధికారి కావ్య రిమాండ్ విధించారని ఎస్‌ఐ పేర్కొన్నారు.

చిరుత కోసం వేట

- అడవిలో 2 గంటలపాటు కూంబింగ్
- వీరన్నపేట శివారు కొండపై చిరుత సంచారంతో స్థానికుల్లో భయాందోళన
- కదిలిన యంత్రాంగం..అడవిలో జల్లెడ.. కనిపించని ఆచూకీ


అడవిలో చిరుతకోసం గాలిస్తున్న పోలీస్, అటవీశాఖ అధికారులు, సిబ్బంది

మహబూబ్‌నగర్/మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చిరుత కోసం వేట మొదలైంది.. అడవిలో జల్లెడ పట్టారు... ఆచూకీ లభించకపోవడంతో పులిని పట్టేందుకు చిరుత సంచరించే ప్రాంతంలో బోను ఏర్పాటు చేశారు... మహబూబ్‌నగర్ నగర శివారులోని వీరన్నపేట ఇళ్ల సముదాయానికి కొద్దిదూరంలోని కొండపై రెండ్రోజులు చిరుత కనిపించింది. ఇళ్లల్లో ఉండే ప్రజలకు సమీప దూరంలోనే చిరుత తిరుగుతూ కనిపించడంతో ఆ ప్రాంతంలో నివాసముంటున్న ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. రాత్రివేళ బయటకు రావడానికే వణికిపోతున్నారు. దీంతో అధికార యంత్రాంగం ఎలాగేనా పట్టుకుని అడవిలో వదలాలని నిర్ణయించుకుంది. గురువారం అటవీశాఖ అధికారులు, పోలీసులు, మునిసిపల్ అధికారులు, స్థానికులు దాదాపు 20-25 మంది చిరుత కోసం కూంబింగ్ నిర్వహించారు. సాయంత్రం 4:30 గంటలనుంచి 6:30 గంటల వరకు 2 గంటల పాటు ఈ బృందాలు వీరన్నపేట, టీడీగుట్ట ప్రాంతంలో జల్లెడ పట్టినా చిరుత ఆచూకీ లభించలేదు. అయితే చిరుత అక్కడినుంచి మరో ప్రాంతానికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఒకవేళ ఆ ప్రాంతంలో ఉన్న జనం అలికిడికి అక్కడినుంచి జారుకుని ఉంటుందని భావిస్తున్నారు. అయితే చిరుత కనిపించిన ప్రాంతంలో బోను ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఒకవేళ ఆ ప్రాంతంలో సంచరించినట్లైతే సీసీ ఫు టేజీలో కనిపించనుంది. అధికారులు మాత్రం స్థానికులు అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళ బయటకు రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఒంటరిగా పిల్లను, వృద్ధులను బయటకు పంపించవద్దని జనం గుంపులుగా ఉండాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గుర్రం గట్టు (వీరన్న పేట) పరిసరాల్లో చిరుత సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు ఉత్పన్నం కాకుండా సంబంధిత అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురువారం గుర్రం గట్టు పరిసరాల్లో చిరుత సంచరిస్తున్న నేపథ్యంలో ఆమె ఎస్పీ డి.జానకితో కలిసి కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. చిరుత సంచారంతో ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు ఉత్పన్నం కావద్దని ఆదేశించారు. అటవీ శాఖ, పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిసరాలలో చిరుత సంచారం కనిపించటం వల్ల ప్రజలు తమ భద్రత కోసం జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం తరఫున అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చిరుత సంచార ప్రాంతాల్లో పహారా బలగాలు, డ్రోన్లు, నైట్ విజన్ కెమెరాల ద్వారా గమనిస్తున్నట్లు తెలిపారు. ప్రజల భద్రత కోసం అదనపు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిరుతను చూసినట్లైతే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు నేరుగా సమాచారం ఇవ్వాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా అటవీశాఖ అధికారి సత్యనారాయణ, ఆర్డీవో నవీన్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి

నిరుపయోగంగా.. సంచార వాహనాలు

- మూలకు చేరిన ద్విచక్ర సంచార అంబులెన్సులు
- చెంచు పెంటలకు నిలిచిన ప్రాథమిక వైద్య సేవలు

మన్ననూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలోని మారు మూల ప్రాంతాల్లో సంచార వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన దిచక్రవాహన అంబులెన్సులు మన్ననూరులోని పీహెచ్‌సీ ఆవరణలో గల డయాగ్నోస్టిక్ కేంద్ర భవనంలో నిరుపయోగంగా ఉన్నారు. జిల్లా పరిధిలోని 10 పీహెచ్‌సీలకు ఒక్కో ద్విచక్ర వాహనం చొప్పున 10 వాహనాలను ప్రభుత్వం తీసుకువచ్చి మన్ననూరులో ఉంచింది. ఈ వాహనాల్లో ప్రాథమిక వైద్యం అందించేందుకు మెడికల్ కిట్టును అందుబాటులో ఉంటుంది. ఎమర్జెన్సీ మాస్టర్ ట్రైనర్లుగా ప్రాథమిక వైద్య సేవలందించే విధంగా శిక్షణ ఇచ్చి వాహనాల ద్వారా 108 కి వచ్చిన కాల్స్ ఆధారంగా మారుమూలన, రాళ్లు తేలిన రహదారి, పెద్ద వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉన్న చెంచు పెంటలు, మారుమూల గ్రామాలకు వెళ్లి రోగిని అపాయం నుంచి తప్పించి ప్రాథమిక వైద్యం అందిస్తుండేవారు. వాహనాలకు పెట్రోలు పోసేందుకు, ఈఎంటీలుగా సేవలందిస్తున్న ఆరోగ్య సిబ్బంది నెలసరి వేతనాలు చెల్లించేందుకు నిధుల కొరత ఉన్న కారణంగా ఈ వాహనాలను మన్ననూరులోని ఓ భవనంలో నిరుపయోగంగా వదిలేశారు. ఈఎంటీలుగా విధుల్లో ఉన్న వారిని 108లో నియమించుకున్నారు.

ప్రస్తుతం వర్షాకాల సీజన్ కావడంతో రోడ్డు మార్గం సరిగ్గా లేని చెంచు పెంటలకు వెళ్లేందుకు పెద్ద అంబులెన్సులకు ఇబ్బందిగా ఉంటుందనే ఉద్దేశంతోనే ప్రత్యామ్నాయ మార్గంగా ద్విచక్ర వాహన అంబులెన్సులను ఏర్పాటు చేసింది.

గతంలో నడిచిన ద్విచక్ర వాహన అంబులెన్సుల ద్వారా మారుమూల చెంచు గిరిజనులకు అత్యవసర పరిస్థితుల్లో ఈఎంటీల ద్వారా మెరుగైన సేవలందాయని, నిరుపయోగంగా ఉన్న వాహనాలను సంచార వైద్యానికి ఉపయోగించుకోవాలని చెంచులు కోరుతున్నారు.



మన్ననూరు డయాగ్నోస్టిక్ భవనంలో వృథాగా మారిన సంచార ద్విచక్ర వాహన అంబులెన్సులు

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతుడు నాగయ్య (ఫైల్)

ఖిల్లాఘణపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని సల్కెలాపూర్‌కి చెందిన రైతు గూళ్ల నాగయ్య (57) వ్యవసాయ పొలం వద్ద కరెంటు షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుని భార్య గూళ్ల లక్ష్మి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని వ్యవసాయ పొలంలో బుధవారం సాయంత్రం వరి నారుకు నీరు పారబెట్టేందుకు వెళ్లాడు. స్టార్టర్ డబ్బా వద్ద మోటారు ఆన్ చేస్తుండగా.. ప్రమాదవశాత్తు కరెంటు వైర్లు చేతికి తగిలి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య గూళ్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు శిక్షణ ఎస్ఐ నరేష్ తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రైలుకింద పడి యువకుడి అనుమానాస్పద మృతి


చాకలి వీరేష్ (ఫైల్)

వడ్డేపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొంకల గ్రామానికి చెందిన చాకలి వీరేష్(20) గురువారం తెల్లవారుజామున రైలు కిందపడి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన చాకలి పద్మ, సోములు దంపతుల రెండో కుమారుడు వీరేష్ ఐదేళ్ల నుంచి తిరుపతిలో కంకర మిషన్‌లో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకోవాల్సిన పిరికివాడుకాదని, దీనిపై తమకు అనుమానంగా ఉందని తండ్రి సోములు తెలిపారు. తన కుమారుడి మృతిపై విచారణ చేయాలని తండ్రి కోరారు.

అదృశ్యమైన వ్యక్తి కర్నూల్ బస్టాండ్‌లో మృతి


ఆంజనేయులు (ఫైల్)

గోపాల్‌పేట, జూలై (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వ్యక్తి అదృశ్యమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బుద్ధారం గ్రామనికి చెందిన ఆంజనేయులు గౌడ్ గ్రామంలోనే నివాసం ఉంటున్నాడు. ఈ నెల ఆరున ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. 8వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా బస్టాండ్‌లో బస్సు దిగి బస్టాండ్‌లో పడుకున్నాడు. నిద్ర లేపబోయి బస్టాండ్ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి చూసే సరికి ఆంజనేయులు అప్పటికే మృతిచెందాడు. మృతదేహన్ని కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. 'వ్యక్తి అదృశ్యం' కథనాన్ని ఆంజనేయులు కుటుంబ సభ్యులు వాట్సాప్‌లో వైరల్ చేశారు. కథనాలను చూసిన పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఆంజనేయులు మృతదేహాన్ని గుర్తుపట్టారు. గుండె పోటుతో మృతిచెంది ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు.

మహిళ మృతి : కేసు నమోదు

వంగూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని రంగాపూర్‌తండా లో వివాహిత దారవత్ కమ్మ(30) ప్రమాదవశాత్తు బెల్లం పానకంలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. మృతురాలికి భర్త పాండునాయక్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి సోదరుడు మోతిలాల్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నాడు

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బస్సు

- భార్యాభర్తలు, కుమార్తెకు గాయాలు

గోపాల్‌పేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో రోడ్డుపై ఆగి ఉన్న టూవీలర్‌ను ఢీ కొన్నడంతో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని రేకులగడ్డ కాలనీకి చెందిన జంగిడి అంజి, తన భార్య పద్మ, కుమార్తె కావ్యతో గురువారం ఉదయం మండల కేంద్రానికి టూవీలర్ పై వస్తున్నాడు. చింతబావి పూల వద్ద తన కుమార్తెను బైక్ నుంచి కిందకి దిపుదామని రోడ్డుపై టూవీలర్ ఆపాడు. వెనుకాలే వస్తున్న నాగర్‌కర్నూల్ డిపోకు చెందిన టీజీ 31 జెడ్ 0103 బస్సు నాగర్‌కర్నూల్ నుంచి వనపర్తి వెళ్తుంది, ఆంజి రోడ్డుపై బైక్‌తో ఉండగా.. ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించబోయి, అంజికి బస్సు ఫుట్ బోర్డు కొన తగిలి ముగ్గురు బైక్ పైనుంచి కింద పడ్డారు. దీంతో అంజి, పద్మ కాళ్లకు గాయాలయ్యాయి. కావ్యకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఆటోలో మండల కేంద్రంలో ప్రాథమిక ఆర్యోగ కేంద్రానికి తీసుకెళ్లి అక్కడ ప్రథమ చికిత్స అందించి వనపర్తి ఆసుపత్రికి తరలించారు. నాలుగు నెలల కిందట కావ్య నాగర్‌కర్నూల్ డిపోకు చెందిన బస్సు టైరు కింద పడి గాయాలయ్యాయి.

పేకాట స్థావరంపై దాడి ; 13 మందిపై కేసు

మానవపాడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని చిన్న పోతులపాడు శివారులో గురువారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. 13మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ.6,780 నగదును స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

- పీయూ ఉపకులపతి వీఎన్ శ్రీనివాస్



పీయూ వీసీని సన్మానిస్తున్న ఆదర్శ డిగ్రీ కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదవాలని పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి వీఎన్ శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌కు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. చదువులను విద్యార్థులు నిర్లక్ష్యం చేయకుండా ఏకాగ్రతతో చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఉన్నత విద్య చదవడం ద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. రిజిస్ట్రార్ పి.రమేష్ బాబు మాట్లాడుతూ చదవుకునేందుకు ప్రస్తుతం అనేక వనరులు ఉన్నాయన్నారు.

వాటిని ఉపయోగించుకొని విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరి బి.రాములు, కోశాధికారి వి.అరుణ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది కళాశాల డైరెక్టర్ వి.మనోహర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, హెచ్‌వోడి డాక్టర్ రాకీ జాయిస్, టాస్క్ జిల్లా మేనేజర్ సిరాజ్, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

- డీఆర్‌డీవో పీడీ ఉమాదేవి
- సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన


జూరాల గ్రామ శివారులో మొక్కలు నాటుతున్న డీఆర్‌డీవో పీడీ

ఆత్మకూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని డీఆర్‌డీవో పీడీ ఉమాదేవి అన్నారు. వనపర్తి జిల్లా, ఆత్మకూరు పట్టణంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్ కోసం గురువారం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్లాంటు ఏర్పాటు కోసం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో, వెంకటేశ్వర స్వామి ఆలయ భూమిని పరిశీలించినట్లు తెలిపారు. ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కోటి రూపాయల వ్యయంతో సోలార్‌ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ముందుగా రూ. 20 లక్షలు బ్యాంకు నుంచి పొందేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. అనంతరం హరిత వనోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని జూరాల గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డీపీఎం నాగమల్లిక, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీవో శ్రీపాద, ఏపీఎంలు శ్రీనివాసులు, శక్రు నాయక్ పాల్గొన్నారు.

నేడు మీర్ అహ్మద్ అలీ, నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ జయంతి

పాలమూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జూలై 11న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మీర్ అహ్మద్ అలీ, నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ జయంతిని జిల్లా కేంద్రంలోని జలసౌధలో నిర్వహించనున్నట్లు ఏఈ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. 1877జూలై 11న హైదరాబాద్ రాష్ట్రంలో మధ్య తరగతి కుటుంబంలో జన్మించి, డిసెంబరు 6, 1949న మరణించారు.

తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలో వైరా రిజర్వాయర్, పాలేరు ప్రాజెక్టు, నిజామాబాద్ జిల్లా నిజాంసాగర్ ప్రాజెక్టు, పోచారం ప్రాజెక్టు, కరీంనగర్ జిల్లాలో ఎగువమానేరు డ్యామ్, మహబూబ్ నగర్ జిల్లాలో రాయపల్లి, డిండి, కోయిల్‌సాగర్ ప్రాజెక్టు, హైదరాబాద్‌లో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలు, నల్గొండలో మూసి ప్రాజెక్టు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు, మరట్వాడాలో పూర్ణ ప్రాజెక్టు, మరియు మెదక్ జిల్లాలో ఘనపూర్ ప్రాజెక్టు నిర్మాణంలో కీలక భూమిక పోషించారన్నారు.

ప్రాజెక్టులు, పలు భవనాలు నాడు నిర్మించినవి నేటికీ అమోఘంగ ఉన్నాయి.

తెగని పంచాయితీ

(5వ పేజీ తరువాయి)

అత్యధికంగా మిస్సింగ్ సర్వే నెంబర్లకు సంబంధించి 11,028 దరఖాస్తులు రాగా అత్యల్పంగా 38ఈ సర్టిఫికెట్ కు సంబంధించిన దరఖాస్తులు 65 వచ్చాయి. దరఖాస్తులపరంగా తీసుకుంటే విస్తీర్ణంలో పెద్ద జిల్లా అయిన నాగర్‌కర్నూలులో 16,648 దరఖాస్తులు రాగా ఆ తర్వాత మహబూబ్‌నగర్ జిల్లాలో 10,909 దరఖాస్తులు వచ్చాయి. నారాయణపేట జిల్లాలో అత్యల్పంగా 4052 దరఖాస్తులు వచ్చాయి. మిస్సింగ్ సర్వే నెంబర్లు, పెండింగ్ మ్యూటేషన్, డీఎస్ పెండింగ్, విస్తీర్ణం సమస్యలు, భూమి స్వభావం సరిచూడటం, పట్టాదారు పేర్లు సరిచూడటం, నిషేధిత జాబితా నుంచి తొలగింపు, నిషేధిత జాబితాలో చేరిక, ఓఆర్సీ లేనివి, 38ఈ సర్టిఫికెట్ లేనివి, సక్సేషన్, భూసేకరణకు సంబంధించిన విభాగాల్లో దరఖాస్తులు స్వీకరించగా ఇతర భూ సమస్యలకు సంబంధించి 11,271 దరఖాస్తులు వచ్చాయి. అయితే వీటి పరిష్కారం ఇప్పుడు అధికారులకు కత్తి మీద సాములా మారింది. ఇందులో ఎక్కువ శాతం రిజెక్షన్ జాబితాలోకే వెళ్లే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం దరఖాస్తుదారుల పార్టీలకు నోటీసులు ఇస్తుండగా క్షేత్రస్థాయికి వెళ్లడం, వాటిని సర్వే చేయడం, భూ రికార్డులు పరిశీలించడం చాలా కష్టతరంగా మారే పరిస్థితి ఉంది. పైలట్ మండలమైన నారాయణపేట జిల్లా మద్దూరులో భూభారతి సదస్సుల్లో 1091 దరఖాస్తులు వచ్చాయి. అందులో ఇప్పటివరకు కేవలం 475 దరఖాస్తులను పరిశీలించారు. మే నెలలోనే ఇక్కడ సదస్సులు ముగియగా రెండు నెలలైనా ఇంకా పూర్తికాకపోవడం గమనార్హం.


అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సర్వేయర్ల నియామకమెప్పుడో..?

భూభారతి రెవెన్యూ సదస్సులను పైలట్ మండలంలో ప్రారంభించిన సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యల పరిష్కారం కోసం 9 వేల మంది సర్వేయర్లను నియమిస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటివరకు సర్వేయర్ల నియామకంపై స్పష్టత రాలేదు. ప్రస్తుతం వచ్చిన 45,269 దరఖాస్తుల్లో సర్వేయర్ల పనిద్వారా పరిష్కారమయ్యే దరఖాస్తులే సింహభాగమని చెప్పవచ్చు. ప్రస్తుతం అన్ని జిల్లాల్లో సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉంది. మండలాలకు అనుగుణంగా సర్వేయర్లు అందుబాటులో లేరు. భారీ మొత్తంలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలంటే సర్వేయర్లు కావాలి. అలాగే భూభారతిలో భాగంగా ప్రతీ రెవెన్యూ గ్రామానికి వీఆర్ఓ తరహాలో జీపీఓలను నియమిస్తారని చెప్పారు. పాత వీఆర్ఓలకు పరీక్షలు కూడా నిర్వహించారు. ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిన వారి రాకతో కూడా చాలా సమస్యలు పరిష్కారం కానున్నాయి. సిబ్బంది కొరత ఉండటం వల్ల క్షేత్రస్థాయి పరిశీలన కూడా కష్టంగా మారుతోంది. జీపీఓలు, సర్వేయర్ల నియామకం పూర్తయితేనే ఈ సమస్యలు పరిష్కారమవుతాయని అధికారులు చెబుతున్నారు. మరి గడువులోపు ఎన్ని సమస్యలు పరిష్కరిస్తారు..? గడువు పెంచుతారా? లేక పోర్టల్ అమలు చేసిన తర్వాతే పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కరిస్తారా? వేచిచూడాలి.

13న ఉమ్మడి జిల్లాస్థాయి సైక్లింగ్ ఎంపికలు


మాట్లాడుతున్న సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం

మక్తల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ఆదేశాల మేరకు 13న మక్తల్ మినీ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం తెలిపారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖేలో ఇండియా సీనియర్ మహిళలు 2006కంటే ముందు జన్మించిన వారికి 20కిలోమీటర్ల సైక్లింగ్ పోటీలు, 2007 తర్వాత జన్మించిన వారికి పది కిలోమీటర్ల పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. ప్రతిభ కనబర్చిన వారిని ఈనెల 20న హైదరాబాద్‌లో జరిగే సౌత్‌జోన్ పోటీలకు పంపిస్తామన్నారు. సొంత సైకిల్, క్రీడా దుస్తులు, హెల్మెట్, షూ ధరించి పాల్గొనాల్సిందిగా కోరారు. ఈ నెల 12వ తేదీలోపు సమాచారం అందించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 7702713139కి సంప్రదించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో పీఈటీలు అంబ్రేష్, మరేష్‌కుమార్, దామోదర్ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

- ఎస్‌బీఐ, సీఎఫ్ఎల్ కౌన్సెలర్ ఎస్కే చాంద్ సుల్తానా



పులిమామిడి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత సదస్సులో మాట్లాడుతున్న చాంద్ సుల్తానా

ఊట్కూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరూ సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని సీఎఫ్ఎల్ కౌన్సెలర్ ఎస్కే చాంద్ సుల్తానా సూచించారు. గురువారం మండలంలోని పులిమామిడి గ్రామంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో జన సురక్ష అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఏబ్యాంక్ కూడా వ్యక్తిగత సమాచారాన్ని ఫోన్‌లో అడగదని గుర్తించుకోవాలన్నారు. ల్యాటరీ, లక్కీ డ్రా పేరిట ఎవరైన సమాచారం, ఓటీపీలు అడిగినా ఇవ్వరాదని సూచించారు. అవసరం అనిపిస్తే నేరుగా బ్యాంకుకు వచ్చి తెలుసుకోవచ్చన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన బీమా పథకాలు, అకౌంట్ లావాదేవీలతో పాటు సుకన్య సంవృద్ధి పథకం గురించి వివరించారు. ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉన్నప్పుడే కుటుంబాలు ఆర్థికంగా బలపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రవి, ఏఈవో తిలక్, రత్నసాగర్, ఆశా కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దకొత్తపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగు చేయదలచిన రైతులు తమ ధ్రువీకరణ పత్రాలను కొల్లాపూర్ ఉద్యాన శాఖ కార్యాలయంలో అందజేయాలని స్థానిక ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఎం.లక్ష్మణ్ తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు తమ భూమి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, పాస్ పోర్టు సైజ్ ఫొటో, మూడు సేట్ల జిరాక్స్ కాపీలు అందజేయాలని ఆయన పేర్కొన్నారు. మొక్కలను సీనియారిటీ ప్రకారం రైతులకు అందజేస్తారని, ఆసక్తి ఉన్న రైతులు తమధ్రువీకరణ పత్రాలను ముందుగానే అందజేయాలని ఆయన తెలిపారు.

ఇంటర్వ్యూ..

అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

- కృష్ణయ్య, ఎంపీడీవో, ఊర్కొండ



ఊర్కొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు ఎలా కొనసాగుతున్నాయి.?

మండలంలో 16గ్రామపంచాయతీలు, వాటి పరిధిలో ఒక బుడగజంగాల కాలనీ, 7 గిరిజన తండాలు ఉన్నాయి. నిధుల ఇబ్బంది ఉన్నా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి.

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు ఏమిటీ ?

వర్షాకాలం ప్రారంభం దృష్ట్యా గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, పారిశుధ్య పనులు చేపట్టడం, మురుగునీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవడం, మురుగు కాలువల నిర్వహణలో లోపం లేకుండా చర్యలు తీసుకుంటున్నాము.

ప్రత్యేక పాలనతో గ్రామ పంచాయతీలు లోపభూయిష్టంగా తయారయ్యాయని ఆరోపణలు ఉన్నాయి ?

అలాంటిది ఏమీలేదు. ప్రత్యేక పాలనలో అధికారులపై పనిభారం పడింది తప్ప ఎక్కడా ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేదు. ప్రజా ప్రతినిధులున్నా, అధికారులు అయినా గ్రామాలు అభివృద్ధి చేయాలనేది సంకల్పంగా ఉంటుంది.

న్యూస్ బాక్స్

ఏబీవీపీ మండల కన్వీనర్‌గా శ్రీకాంత్



వెల్దండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మండల కన్వీనర్‌గా వెల్దండకు చెందిన రేణుకుంట్ల శ్రీకాంత్ ఎన్నికయ్యారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాంత్‌ను కన్వీనర్‌గా, కో కన్వీనర్‌గా శివచరణ్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా నాగరాజు నియమితులయ్యారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

'ఉచిత కరెంట్ పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

వంగూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రజకులకు ఉచిత పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని రజక సంఘం మండల గౌరవ అధ్యక్షుడు లట్టుపల్లి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వంగూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏడాదిగా రూ.187 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

చారకొండ, జూలై 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి తనూజరాజు అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్సులు, ఆధార్‌కార్డు లింకుచేయబడిన మొబైల్ నంబర్ తీసుకొని సమీప ఏఈవోల వద్దకు వెళ్లి రైతు రిజిస్ట్రేషన్ నమోదు చేయించుకోవాలని అన్నారు.

నేడు బస్సులను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

అచ్చంపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ఉత్తరముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రానికి సీబీఎం ట్రస్టు చైర్మన్ డాక్టర్ అనురాధ రెండు బస్సులను వితరణ చేసినట్లు ఆలయ చైర్మన్ మాధవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం కొండ దిగువన నుంచి కొండపైకి వరకు నేడు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ బస్సులను ప్రారంభిస్తారని తెలిపారు.

నేడు జాబ్‌మేళా

కల్వకుర్తి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని వైఆర్ఎం కళాశాలలో ఎస్‌సీఎల్ కంపెనీ, ఇంటర్‌బోర్డు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, వైఆర్ఎం కళాశాల కరస్పాండెంట్ మేకల రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో 75శాతం మార్కులతో ఇంటర్మీడియట్, ఒకేషనల్ పాసైన విద్యార్థిని, విద్యార్థులకు ఎస్‌సీఎల్‌లో ఉద్యోగ అవకాశంతోపాటు డిగ్రీ కూడా చదివే అవకాశం ఉందని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

చారకొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం రాత్రి చోటుచేసుకొంది. ఏఎస్ఐ అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చారకొండ పంచాయతీ పరిధిలోని రాంపురం గ్రామానికి చెందిన వంగూరు వెంకట్‌నారిగౌడ్ (54) రోజులాగే పత్తి పంటకు నీరు పెట్టేందుకు స్టాటర్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలో పడిపోయాడు. పక్క పొలంలో పనిచేస్తున్న ఆయన చిన్న కుమారుడు శివకుమార్, మరో రైతు సత్యంగౌడ్ గమనించిన వెంటనే వెంకట్‌నారిగౌడ్‌ను చారకొండకు చికిత్సకోసం తీసుకెళ్తుండగా అప్పటికే మృతి చెందాడు. చిన్న కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య భారతమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

వంద పడకల ఆసుపత్రికి మోక్షం

- కల్వకుర్తిలో నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రులు, ఎమ్మెల్యే

- రూ.45.5కోట్ల కేటాయింపు

- ఆసుపత్రికి 127 పోస్టులు మంజూరు

కల్వకుర్తి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో వంద పడకల ఆసుపత్రికి మోక్షం లభించింది. రూ.45.5కోట్లతో భవన నిర్మాణంతో పాటు వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. శుక్రవారం వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి మంత్రులు, ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారు. దీంతో త్వరలోనే మెరుగైన సేవలు అందడానికి అవకాశం దక్కుతుంది.

వంద పడకల ఆసుపత్రితో....

కల్వకుర్తి పట్టణంలోని 99 సర్వే నెంబరులో నాలుగెకరాల 15గుంటల్లో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం గానుంది. రూ. 24కోట్లతో ఆసుపత్రి భవనం నిర్మిస్తుండగా రూ. 21 కోట్లతో మౌలిక వసతులు, ఫర్నిచర్, పరికరాలు సమకూర్చనున్నారు. ఆసుపత్రిలో పని చేయడానికి 127 మంది సిబ్బందిని (34 మంది వైద్యులు) ఆర్థిక శాఖ అనుమతితో కేటాయించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసిం హాతో నిధుల మంజూరుకు కృషి చేశారు. ఆసుపత్రి నిర్మాణం 24 నెలల్లోనే పూర్తి చేసి వైద్య సేవలు అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం సమయం నిర్దేశించింది. వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.



కల్వకుర్తిలోని 99 సర్వే నెంబరులో మంత్రుల సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ అమరేందర్, మాజీ సర్పంచ్ బ్బాంగి ఆనంద్‌కుమార్, నాయకులు

మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తికి వంద పడకల ఆసుపత్రి మంజూరు కావడంతో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నాం. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాను. రూ.45.5 కోట్లతో ఆసుపత్రి నిర్మాణం, వసతుల కల్పన జరగనుంది. వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహలకు నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు.

నేడు కల్వకుర్తికి మంత్రుల రాక

- ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు, నాయకులు

కల్వకుర్తి నియోజకవర్గంలో శుక్రవారం ముగ్గురు మంత్రులు పర్యటిస్తున్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.270కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు రోడ్లు, ఆసుపత్రి నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయనున్నారు. పట్టణంలోని 99 సర్వే నెంబరులో మధ్యాహ్నం బహిరంగ సభ జరగనుంది. సభ ఏర్పాట్లను అదనపు కలెక్టర్ అమరేందర్, కల్వకుర్తి ఆర్డీవో ఎస్.శ్రీను, తహసీల్దార్ ఇబ్రహీం, మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ బి.నాగార్జునతోపాటు పలువురు నాయకులు అధికారులు పరిశీలించారు. నాయకులు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ షానవాజ్ ఖాన్, మార్కెట్ డైరెక్టర్ పసుల రమాకాంత్ రెడ్డిఉన్నారు.

వెల్దండకు నేడు మంత్రుల రాక

వెల్దండ : మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావులు హాజరుకానున్నట్లు కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు యెన్నం భూపతిరెడ్డి తెలిపారు.

భక్తి శ్రద్ధలతో గురు పౌర్ణమి

- రామాపురం గ్రామంలో షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

- మహిళల సామూహిక వ్రతాలు

కొల్లాపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : గురుపౌర్ణమి వేడుకలను కొల్లాపూర్ మండల కేంద్రంతో పాటు గ్రామాలలో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల పరిధిలోని రామాపురం గ్రామంలో షిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక వ్రతాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కొల్లాపూర్ మండలం కుడికిళ్ల, సోమశిల, సింగోటం కొల్లాపూర్ పట్టణాల్లో గురువులకు తమ శిష్యులు శాలువా పూలమాలతో సన్మానించారు.

ఏకలవ్య పాఠశాలలో ...

వెల్దండ : మండల పరిధిలోని గుండాల ఏకలవ్య పాఠశాలలో గురుపౌర్ణమి పురస్కరించుకొని సంగీత గురువులు మంకాల దిలీప్‌రాజన్ హాజరై గురుపౌర్ణమి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమన్‌కుమార్, ఉపాధ్యాయులు కోడం భాస్కర్, చంద్రబాబు, సంగీత, వినోదిని, శ్రీనివాస్, మోసెస్, జాషువా, వీరస్వామి, రాజ్ ఉన్నారు.

శిరిడి సాయిబాబా ఆలయంలో..

పెంట్లవెల్లి : మండల కేంద్రంలోని శిరిడీ సా యిబాబా ఆలయంలో వేద పండితులు శివ కుమార్ శర్మ, ప్రవీణ్‌శర్మలు తెల్లవారు జాము నుండి పూజా కార్యక్రమలు నిర్వహించారు.

సత్యసాయి మందిరంలో...

కందనూలు : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం పక్కన గల భగవాన్ శ్రీసత్యసాయి మందిరంలో గురుపౌర్ణమి పురస్కరించుకుని గురువారం భక్తులచే సామూహిక అభిషేకాలు, అర్చనలు, గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు వావిలాల రాజశేఖర్‌శర్మ తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి కన్వీనర్ హకీం విశ్వప్రసాద్, ఎలిమే ఈశ్వరయ్య, సువర్ణ, శారద, బాలకృష్ణ, వివిధ విభాగాల కన్వీనర్లు, యువత, మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రామాపురం గ్రామంలో షిర్డి సాయిబాబా ఆలయంలో సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

ఉద్యోగులకు పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి

- సభ్యత్వ నమోదులో టీఎస్ యూటీఎఫ్ నాయకులు

కొల్లాపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే పీఆర్‌సీ ప్రకటించి పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కొల్లాపూర్ మండలంలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వేణుమాధవ్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు హకీంకారి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ఉమ్మడి జిల్లా పూర్వ కార్యదర్శి నారాయణ, జిల్లా కార్యదర్శి శంకర్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఎండీ రబ్బాని పాషాలు పాల్గొని మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం 2023 జూలై 1 నుంచి అమలు చేయాల్సిన పీఆర్‌సీ రెండేళ్లు గడిచినా నివేదిక వెలువరించకపోవడం అన్యాయమని అన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన ఫిట్‌మెంట్‌ను వెంటనే ప్రకటించాలని, కోరారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకులు మహమ్మద్ గఫూర్, నారాయణ, వెంకటరమణ, మండల ప్రధాన కార్యదర్శి కురుమయ్య, కోశాధికారి క్రాంతి కుమార్, ఉపాధ్యక్షురాలు భారతి, రాధ, పట్టణ ప్రధాన కార్యదర్శి రాజేష్, టౌన్ ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి, సూర్యశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా మహిళా శక్తి విజయోత్సవాలు

కొల్లాపూర్, జూలై 10(ఆంధ్రజ్యోతి) : ఇందిరా మహిళా శక్తి విజయోత్సవాలను గురువారం కొల్లాపూర్ మండల పరిధిలోని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా సాంస్కృతిక శాఖ కళాకారులు శివ నాగులు బృందం కొల్లాపూర్ మండల పరిధిలోని మాచినేనిపల్లి గ్రామం, కుడికిల్ల గ్రామంలో మహిళా శక్తి కార్యక్రమం గురించి మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధి పథకాల గురించి తమ ఆట పాటల ద్వారా మహిళలకు అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలను అందిపుచ్చుకొని జీవితంలో ఆర్థికంగా మహిళలు రాణించాలని కళాకారులు అవగాహన కల్పిస్తు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐకెపి సెర్ప్ సిబ్బంది ఏపీఎం గౌసోద్దిన్, సీసీలు చంద్రశేఖర్ చారి, బాలబ్రహ్మాచారి, వీవోఏలు అలివేలమ్మ, అమీన్‌పాషా, రామభద్రయ్య, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి : కేవీపీఎస్

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తూ ప్రైవేటు విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు ఉచితంగా 25 సీట్లు కల్పించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐఐటీ ఇంటర్నేషనల్ పేరుతో ప్రైవేటు విద్యా సంస్థలు ప్రచారం చేసుకుంటూ విద్యార్థుల నుంచి ఇష్టాను సారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతు, అశోక్, సహాయ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

వెల్టూరు సంతకు బహిరంగ వేలం

ఉప్పునుంతల, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెల్టూరు గొర్రెల, మేకల సంత బహిరంగ వేలం పాటను గురువారం నిర్వహించారు. వివిధ మండలాలకు చెందిన నలుగురు పాల్గొనగా, రూ.2.91లక్షలకు బల్మూరు మండలం గోదల్ గ్రామానికి చెందిన కలకొండ మహేష్‌చారి దక్కించుకున్నారు. డీఎల్‌పీవో వెంకటప్రసాద్, ఎంపీడీవో మోహన్‌లాల్, ఎంపీవో వెంకటేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉమాశంకర్ పాల్గొన్నారు.

పండ్ల తోటలతో రైతులకు లాభాలు

అచ్చంపేట టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పండ్ల తోటల పెంపకంతో రైతులకు అధిక లాభాలువస్తున్నాయని ఉద్యాన శాఖ డివిజన్ అధికారి చంద్రశేఖర్ అన్నారు. ఇందిర సౌర జల గిరి వికాసం ద్వారా మాచారం గ్రామంలో రైతులు ఇటీవల పండ్ల తోటలు సాగుచేశారు. అచ్చంపేట మండలం అచ్చంపేట, లక్ష్మాపూర్, పల్కపల్లి గ్రామాలలో రైతులు సాగుచేసిన పండ్ల, పూలతోటలను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు.

యువతి అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ గోవర్ధన్ గురువారం తెలిపారు. బల్మూరు మండలం ఓ గ్రామానికి చెందిన యువతి జిల్లా కేంద్రంలోని ఓ పారా మెడికల్ కళాశాలలో రెండేళ్ల కోర్సు పూర్తి చేసింది. బుధవారం కళాశాలకి వెళ్లి సర్టిఫికెట్లు తీసుకొస్తానని చెప్పి నాగర్‌కర్నూల్ వచ్చింది. మధ్యాహ్నం నుంచి కన్పించకుండా పోవడంతో చుట్టుపక్కల బంధువుల ఆచూకీ కోసం ప్రయత్నించినా లభించలేదు. దీంతో యువతి తండ్రి నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసులకు బాలకార్మికుడి అప్పగింత

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు సమీపంలో వరలక్ష్మీ టిఫిన్ సెంటర్‌లో మైనర్ బాలుడు పని చేస్తుండడంతో లేబర్ అధికారి పట్టుకుని నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం అప్పజెప్పారు. ఈ సంఘటనపై పట్టణ కేంద్రానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ శాఖ ఎస్ఈగా నరసింహారెడ్డి బాధ్యతలు



కందనూలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన విద్యుత్ నిరంతరం సరఫరా చేసేం దుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు నూతనంగా బాధ్యతలు చేపట్టిన కేవీ.నరసింహారెడ్డి గురువారం అన్నారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఈ హైదరాబాద్‌కు బదిలీ కావడంతో మేడ్చల్‌లో విధులు నిర్వహిస్తున్న నరసింహారెడ్డి ఇక్కడికి వచ్చారు. ఈ కార్యక్రమంలో డి.శ్రీధర్, రవికుమార్, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అంధత్వం నిర్మూలనే లక్ష్యం

- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ అంధత్వ నివారణే లక్ష్యమని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని సీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా కంటి వైద్య శిబిరం గురువారం ఆరవ రోజుకు చేరుకుంది. శిబిరాన్ని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి దగ్గరుండి పర్యవేక్షిస్తూ ఆపరేషన్ చేయించడంతోపాటు కంటి అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే కంటి శుక్లాలు ఉన్న 79మందికి ఆపరేషన్లను విజయవంతంగా చేయించడం జరిగిందని సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ప్రజలు తమ కళ్లను సక్రమంగా పర్యవేక్షించుకుని ఆరోగ్యంగా ఉండాలన్నదే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీపతిరాజు, శ్రీరాములు, గణేష్, రఘు, యాదయ్య, శేఖర్, శివ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రతలో పత్తిసాగు లాభదాయకం

-కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీదేవి

బిజినేపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : అధిక సాంద్రతలో పత్తిసాగు చేయడం రైతులకు లాభదాయకమని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీదేవి అన్నారు. మండలంలోని అల్లీపూర్, మహదేవునిపేట, శాయిన్‌పల్లి, నందివడ్డెమాన్, పోలేపల్లి, బోయాపూర్ తదితర గ్రామాల్లో రైతులు అధిక సాంద్రతలో సాగు చేసిన పత్తి పంటలను గురువారం క్షేత్రపరిశీలన చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. పత్తి పంటకు ఆశించే చీడ పీడల నివారణకు క్రిమిసంహారకాల పిచికారి చేయాల్సిన పద్ధతులను వివరించారు. ఆమె వెంట కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఒంగోలు శైల, రైతులు శేఖర్ ఉన్నారు.

విధుల్లో చేరిన డాక్టర్ ఉషారాణి

- ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్‌గా బాధ్యతల స్వీకరణ

కందనూలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా ప్రొఫెసర్ డాక్టర్ టి.ఉషారాణి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పలువురికి పదోన్నతి కల్పించి ఆసుపత్రులకు మెడికల్ సూపరింటెండెంట్‌లుగా ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో చిన్న పిల్లల ప్రత్యేక వైద్యులుగా పని చేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ టి.ఉషారాణి గురువారం ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి వైద్య పర్యవేక్షకులుగా విధుల్లో చేరారు. ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.రఘు ఆమెకు ఆహ్వానం పలికి, బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవిశంకర్ నాయక్, డాక్టర్ సూర్యనారాయణ, కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ సీజే వసంత్‌కుమార్, పరిపాలన అధికారి కే.రామచంద్రయ్య, సహాయకులు ఆంజనేయులు పాల్గొన్నారు.



డాక్టర్ ఉషారాణికి ఆహ్వానం పలుకుతున్న ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్ రఘు

ఘనంగా మత్స్య రైతుల దినోత్సవం

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి రజిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చేపల ఉత్పత్తి, పెంపకం తదితర విషయాలపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేపల రైతులు ఆక్వా కల్చర్ నిపుణులు, వాటాదారుల సహకారంతో ఆర్థిక పురోగతిని సాధించాలన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు గూళ్ల హరికృష్ణ ముదిరాజ్, మత్స్యకార సంఘాల నాయకులు తెప్ప రుద్రయ్య, మత్స్యశాఖ సీనియర్ అసిస్టెంట్ అచ్చెన్న, ఫిషర్‌మన్ నరసింహ, పీల్డు అసిస్టెంట్ రాజ్‌కుమార్, రాహుల్, రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా మత్స్యశాఖ అధికారి రజిని, మత్స్యకారులు

వీధి విక్రయదారులకు షెడ్లు నిర్మించాలి

- వీధి విక్రయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామయ్య

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ప్రధాన రోడ్డు పక్కన వీధి వ్యాపారం చేసుకుంటున్న వారికి షెడ్లు నిర్మించి జీవనోపాధికి సహకరించాలని వీధి విక్రయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామయ్య డిమాండ్ చేశారు. గురువారం నాగర్‌కర్నూల్ మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వీధి విక్రయదారులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రధాన రోడ్డు వెంబడి చాలా మంది వీధి విక్రయదారులు దశాబ్దాలుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాధిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో పట్టణంలోని శ్రీపురం రోడ్డు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ గోడ వెంబడి షెడ్లు, డబ్బాలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించారన్నారు. అదే తరహాలో మిగిలిపోయిన వీధి విక్రయదారులకు డబ్బాలు వేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వీధి విక్రయదారుల సంఘం జిల్లా కార్యదర్శి యాదగిరి, నాయకులు సాదిక్, ఖాజా, శేఖర్‌పాషా, మురళి, ఆంజనేయులు, సుధాకర్, లక్ష్మయ్య, నరసింహ పాల్గొన్నారు.

కేఎల్ఐ కాల్వల్లో జమ్ముగడ్డిని తొలగించాలి : బీజేపీ

పెద్దకొత్తపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద కాలువల్లో ఏపుగా పెరిగిన జమ్ముగడ్డిని తొలగించాలని భారతీయ జనతా పార్టీ పెద్దకొత్తపల్లి మండల శాఖ డిమాండ్ చేసింది. గురువారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు దేశమోని పరశురాముడు ఆధ్వర్యంలో పెద్దకొత్తపల్లి మండలంలో జమ్ము గడ్డితో పేరుకుపోయిన కేఎల్ఐ కాలువలను బీజేపీ బృందం పరిశీలించింది. ఆయన మాట్లాడుతూ మొన్న మంత్రి జూపల్లి కేఎల్ఐ పంపు మోటార్లను ప్రారంభించి నీటిని రిజర్వాయర్లకు విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మరో కొద్ది రోజుల్లోనే వ్యవసాయ పొలాలకు నీళ్లు వచ్చే అవకాశం ఉందని, జమ్ము గడ్డితో నిండిపోయిన కాలువల్లో ఇలాంటి పరిస్థితిలో చివరి ఆయకట్టుకు సాగునీరందడం సాధ్యపడుతుందా అని పరశురాముడు ప్రశ్నించారు. ఇప్పటికైనా కాలువల్లో పేరుకుపోయిన జమ్ముగడ్డితోపాటు ముళ్ల చెట్లను తొలగించాలని కోరారు. కార్యక్ర మంలో బీజేపీ నాయకులు పదిర భీమేష్‌రెడ్డి, బెల్లి తిరుమల్‌యాదవ్, బద్దుల ప్రవీణ్‌కుమార్‌యాదవ్, సరాయి శేఖర్, మేకల శివయాదవ్, భీమనోని లింగస్వామి, మార్కండేయ , దాది లింగస్వామి, ఇంద్రకంటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కేఎల్ఐ కాలువల్లో పేరుకుపోయిన జమ్మును చూపుతున్న బీజేపీ నాయకులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు సీసీ రోడ్డు నిర్మించాలి

- ఏబీవీపీ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్‌కు వినతి

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులోని ప్రభుత్వం ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలకు సీసీ రోడ్డును నిర్మించి విద్యార్థుల రాకపోకలకు కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంగనమెని బంగారుబాబు డిమాండ్ చేశారు. గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బంగారుబాబు మాట్లాడుతూ శ్రీపురం వెళ్లే ప్రధాన రోడ్డు నుంచి కళాశాలలోకి వెళ్లేందుకు సీసీ రోడ్డు లేకపోవడంతో గోతులమయమైన విద్యార్థులు, అధ్యాపకులు వెళ్లేందుకు ఇబ్బంది ఉందన్నారు. సీసీ రోడ్డు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా నాయకులు ప్రసాద్‌కుమార్, శివ, రాము, శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, మున్నా, బాలకృష్ణ పాల్గొన్నారు.

రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి

- జర్నలిస్టుల దీక్షలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో అర్హులైన జర్నలిస్టులందరికీ రెండు రోజుల్లో నివాస స్థలాల విషయంలో ప్రభుత్వపరంగా స్పష్టమైన హామీ ఇవ్వాలని, లేని యెడల బీజేపీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు పేర్కొన్నారు. కొల్లాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో గత నెల 25 నుంచి నియోజకవర్గంలోని జర్నలిస్టులకు ప్రభుత్వపరంగా నివాస స్థలాలు ఇవ్వాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 16వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు గురువారం ఎల్లేని సుధాకర్‌రావు మద్దతు తెలిపారు. దీక్షలో కూర్చున్న టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు రామచంద్ర నియోజకవర్గ కన్వీనర్ జలకం మద్దిలేటి, మల్లి కార్జున్ సాగర్, రమణ, భాను ప్రకాష్, కారంగి గోవిందు, రవి, మల్లేష్, స్వాములు, గోపాసి కేశవులు, సురేందర్, తరుణ్ రాములతో దీక్ష కార్యాచరణపై చర్చించారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు బచ్చలకూర జర్నలిస్టుల పట్ల మంత్రి జూపల్లి కృష్ణారావు చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బండల వెంకటస్వామి ఆధ్వర్యంలో జర్నలిస్టుల రిలే దీక్షలకు సంఘీభావం తెలిపారు. బీజేపీ రాష్ట్ర నాయకులు సందు రమేష్, తమటం శేఖర్ గౌడ్, మేకల శ్రీనివాస్ యాదవ్, మండల అధ్యక్షుడు కేతూరి నారాయణ పాల్గొన్నారు.

మాచారంలో సేవా కార్యక్రమాలు

మన్ననూర్, జూలై10 (ఆంధ్రజ్యోతి) : అనూష ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత జలంధర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో గురువారం ప్రజలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో కొన్నేళ్లుగా తన సొంత నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రజలు స్థానిక సీతారామాంజనేయస్వామి ఆలయంలో స్థానికులు పూజా కార్యక్రమాలు నిర్వహించి మిఠాయిలు పంచారు. లెనిటీ ఫౌండేషన్‌లో వృద్ధులకు పండ్లు పంపిణీ, గ్రామంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాచారం గ్రామస్థులు